క్లుప్తంగా

అన్నదానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం నిర్మల వృద్ధాశ్రమంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఇంటాక్, మానవతా సంస్థ సభ్యులు విశ్రాంతి హెచ్‌ఎం కల్లూరు బాలయల్లారెడ్డి తన తండ్రి చిన్న ఎల్లారెడ్డి స్మారక సేవార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవత సంస్థ కేంద్ర నియంత్రణ కమిటి డైరెక్టర్ రాటాల గోపి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, విశ్రాంత సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, సోంటం ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నెముక

వైవీయూ : రైతు దేశానికి వెన్నెముక లాంటి వారని, వారు లేకపోతే ప్రజలకు తిండికూడా దొరకదని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని కళాశాలలో జాతీయ రైతుదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రధాని పదవిలో ఉన్న సమయంలో ఈయన రైతులకు మేలు చేసే చట్టాలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని కళాక్షేత్రంలో జనవరి 17వ తేదీన నిర్వహించే శ్రీకృష్ణ దేవరాయలు జయంతి కార్యక్రమంలో బలిజ సామాజిక వర్గీయులంతా పాల్గొని జయప్రదం చేయాలని కాపునాడు నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపునాడు నాయకుడు శ్రీకృష్ణ దేవరాయలు జయంతికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి రాయల్, పారిశ్రామికవేత్త అమరప్ప, బలిజ సంక్షేమ సంఘం కాపు నాడు జిల్లా అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు, అసెంబ్లీ సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కన్వీనర్ శర్మ, కాంగ్రెస్ పార్టీ ఎర్రగుంట్ల అధ్యక్షులు యేసయ్య, జమ్మలమడుగు మండల అధ్యక్షులు పుష్పరాజు, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు రాజేష్, పులివెందుల అధ్యక్షులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాజుపాలెం అధ్యక్షులు రషీద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా బీజేపీ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనను ఈ పదవిలో నియమించినందుకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ, జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపక నియామకాలు చేపట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డిగ్రీ అధ్యాపక ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్ కోరారు. శనివారం రారా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపక ఉద్యోగాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ)తోపాటు రాష్ట్ర అర్హత పరీక్ష ఏపీసెట్, లేదా జాతీయ అర్హత పరీక్ష (నెట్)లేదా పీహెచ్‌డీలు విద్యార్హతగా ఉన్నాయన్నారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతి సంవత్సరం అర్హత పరీక్ష (ఏపీసెట్) నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించలేదన్నారు. వెంటనే సెట్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు సంజయ్, నాగార్జున పాల్గొన్నారు.

స్మార్ట్ అఖిల్ స్టోర్స్ ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని అక్కాయపల్లెలో తాజ్ కాటా పక్కన నూతనంగా స్మార్ట్ అఖిల్ స్టోర్స్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ సుమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా రూ.1000లకు కొనుగోలు చేసిన వారికి కేజీ చక్కెర ఉచితంగా ఇవ్వబడునని, ఎంఆర్‌పీ రేట్లపై 5 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. ఫ్రీ హోం డెలివరీ సదుపాయం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేడెం వేణుగోపాల్, మల్లెం సురేష్ బాబు, డీఎ వెంకటేశ్వర్లు, దేవతి శంకరయ్య, మేడా దామోదరం, సుబ్బయ్య, మురళీ క్రిష్ణ పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మాజీ ప్రధాని దివంగత పీ.వీ. నరసింహారావు సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు తెలిపారు. శనివారం పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, నగర అధ్యక్షులు విష్ణు ప్రీతమ్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కోటపాటి లక్ష్మయ్య, నాగరాణి, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠవాసా... శ్రీ వెంకటేశా..



దేవుని కడపలో గరుడ వాహనునిగా దర్శనమిస్తున్న వైకుంఠ వాసుడు



దేవుని కడపలో స్వామి దర్శనానికి వేచివున్న భక్తులు

కడప కల్చరల్ : ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. దాదాపు జిల్లాలోని అన్ని వైష్ణవాలయాలలో ఉదయం 5 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రతి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని విశేషంగా అలంకరించి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వైకుంఠ (ఉత్తర) ద్వారం లేని ఆలయాలలో ప్రత్యేకంగా అలాంటి ద్వారం సెట్టింగ్ వేసి అందులో నుంచి భక్తులకు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అనుమతించినా తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు వైకుంఠ ద్వారం వద్ద దర్శనం కోసం వేచి ఉన్నారు. స్వామి ఆలయం నుంచి పాతకడప రోడ్డులోని శివాలయం వరకు క్యూలో వేచి ఉండి మరీ దర్శనం చేసుకున్నారు. ఆలయంలో మూలమూర్తిని దర్శించేందుకు కూడా భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరి వేచి ఉన్నారు. వికలాంగులను నేరుగా వైకుంఠ ద్వారం వద్దకు అనుమతించి సులభంగా దర్శనం కల్పించారు.

■ కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మిసత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో హోమం, విశేష పూజలు నిర్వహించారు. జయనగర్ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, బీకేఎం వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, గాండ్లవీధిలోని శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి, రవీంద్రనగర్‌లోని శ్రీ రామాంజనేయ స్వామి ఆలయం, హౌసింగ్‌బోర్డు రామాలయం తదితర ఆలయాలలో కూడా భక్తులు వైకుంఠ ద్వారం నుంచి దైవ దర్శనం చేసుకున్నారు.

పుష్పగిరిలో ప్రత్యేక పూజలు

వల్లూరు : వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కొలువైన శ్రీ చెన్నకేశవస్వామి ఉత్తర ద్వార దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున అలంకార ప్రియుడైన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి బిందె తీర్థ సేవ, విశేష ఆరాధన, ప్రాతఃకాల ఆరాధన, తులసి, బిల్వ పత్రార్చన నిర్వహించారు. అభిషేక ప్రియుడైన శివునికి అభిషేకాలను నిర్వహించారు. విష్ణు అంశయైన చెన్న కేశవునితో బాటు, సంతాన మల్లేశ్వరస్వామి, రాజ్యలక్ష్మిదేవి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు వివిధ రకాల పూలతో పూలంగి సేవను నిర్వహించడంతో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవుని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని తరించారు. ఉదయం నుండి ఉత్తర ద్వారానికి ఎదురుగా గరుడవాహనంపై కొలువుదీరి భక్తులకు సుమనోహరంగా దర్శనమిచ్చిన స్వామివారి ఉత్సవమూర్తికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారి గ్రామోత్సవం

ఘనంగా క్రిస్మస్ ముందస్తు వేడుకలు

కడప ఎడ్యుకేషన్ : కడప అక్కాయపల్లె సాయిబాబా స్కూల్లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ యేసుక్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా క్రిసమస్ పండగను జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ యంవి శ్రీదేవి, సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మెన్ యంవీ సాయి సుధీర్ కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నాగార్జున మోడల్‌స్కూల్లో..

కడప నాగార్జున మోడల్ స్కూల్లో శనివారం ముందస్తు క్రిసమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల నక్షత్రాలు, రంగురంగుల బెలూన్లు, క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జన్మించిన పాక మొదలైన వాటిని రూపొందించారు. వాటిని వేదికపై అలంకరించి క్రిస్మస్ గురించి పిల్లలకు వివరించారు. క్రీస్తు జన్మవృత్తాంతాన్ని పిల్లలు నాటక రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు అందరికీ క్రిసమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని సంధ్య కూడలిలో సెబాస్టియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భారీ క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యేసుక్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో సంతోషాల నడుమ జరుపుకోవాలని కోరుతూ, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు కే బాబు, షఫీ, చెన్నయ్య, మల్లికార్జున్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వినోద్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఏసు ప్రభువు మార్గాన్ని అనుసరించాలి

సర్వమానవాళికి మార్గదర్శకంగా నిలుస్తున్న ఏసు ప్రభువు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని క్రైస్తవ గురువులు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం జిల్లా పరిషత్ కార్యాలయం వద్దగల ప్రేమాలయ నిరాశ్రయుల ఆశ్రమంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డితో కలిసి అతిథులు క్రిస్మస్ కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం పండ్లు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ నజీర్ అహ్మద్, ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయ భాస్కర్, నగర అధ్యక్షుడు సుధీర్ కుమార్, పాస్టర్ పి.మహేష్, డేవిడ్ రాజ్, బిషప్ శామ్యూల్ బాబు, బిషప్ దేవన్న తదితరులు పాల్గొన్నారు.



సంధ్యా సర్కిల్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సాయిబాబా స్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



నాగార్జున స్కూల్లో వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

నగరం శిరస్సుపై క్రైస్తవ కిరీటాలు



విద్యుత్ దీపాలంకరణలో సీఎస్ఐ సెంట్రల్ చర్చి



ఆరోగ్యమాత చర్చి

కడప కల్చరల్ : క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లాలోని చర్చిలన్నీ కొత్త కాంతులతో కళకళలాడుతాయి. జిల్లాలో ఎంతో ప్రత్యేకత గల చర్చిలు ఉన్నాయి. చాలా సంవత్సరాలుగా తమ విశిష్టతను చాటుతూ ఉన్నాయి. ప్రత్యేకించి కడప నగరంలో అద్భుత నిర్మాణ చతురతకు ప్రతిరూపంగా నిలిచి ప్రభువు ప్రేమను పంచే శాంతి మందిరాలుగా నిరంతరం విశ్వాసులతో కళకళలాడుతున్నాయి. క్రిస్మస్ పండుగ తరుణంలో వాటి గురించి క్లుప్తంగా..

నగరంలో తొలి చర్చి

కడప నగరంలో తొలిసారిగా నిర్మించిన క్రైస్తవ ఆరాధన మందిరం కాంగ్రిగేషనల్ చర్చి. పాత రిమ్స్‌కు వెళ్లే దారిలో కుడివైపున గల ఈ చర్చిని 1813లో నిర్మించారు. దేశంలో బ్రిటీషు పాలన సాగుతున్న 1824 ప్రాంతంలో లండన్ మిషన్ సొసైటీ అధినేతలు విలియం హోవెల్‌ను క్రైస్తవ మత బోధకుడిగా ఈ ప్రాంతంలో నియమించారు. సువార్తను జిల్లా అంతటా ప్రచారం చేశారు. చిత్తూరు నుంచి కడపకు జడ్జిగా వచ్చిన వాట్సన్‌తో కలిసి ఆయన సువార్తను బోధించారు. నాటి ఆయన నివాస భవనమే మొన్నటివరకు మున్సిపల్ కార్యాలయంగా ఉండింది. అందులోనే ఆయన క్రైస్తవులతో ప్రతిరోజు ప్రార్థనలు చేయించేవారు. జనం క్రమక్రమంగా పెరగడంతో ఆ భవనం సరిపోక విరాళాలు పోగు చేసి ఆ పక్కనే ప్రస్తుతం ఉన్న కాంగ్రిగేషనల్ చర్చిని నిర్మించారు. నాటి నుంచి దీన్ని స్వతంత్ర్య చర్చిగా నిర్వహిస్తున్నారు. 1922లో డాక్టర్ జాన్ మోసెస్ ఈ చర్చి అభివృద్ధికి కృషి చేశారు. ఆ ప్రాంగణంలో అప్పట్లో నిర్మించిన భవనంలోనే సండే స్కూలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆధ్యాత్మిక, శుభ కార్యాల కోసం ఆ ప్రాంగణంలో విశాలమైన కమ్యూనిటీ హాలును కూడా నియమించారు.

క్యాథడ్రల్ చర్చి

మరియాపురంలోని విశాలమైన మైదానంలో ప్రశాంతమైన వాతావరణంలో ఈ చర్చిని నిర్మించారు. అద్భుతమైన సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా రాయలసీమలోనే విశిష్టమైనదిగా పేరుగాంచిన ఈ చర్చి విభిన్న మతాల సామరస్యానికి నిదర్శనంగా నిలిచి ఉంది. అద్భుతమైన శిల్పసౌందర్యం, గాంభీర్యం కలిసి ఈ చర్చిని జిల్లాలోని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా, శాంతి మందిరంగా, వాస్తు శిల్ప చాతుర్యానికి వేదికగా నిర్మించారు. మరియాపురం తొలి బిషప్ అరుళయ్య ఆశలు, ఆశయాలకు అనుగుణంగా 1988లో ఫిబ్రవరి 11న ఈ చర్చి నిర్మాణం ప్రారంభమైంది. 1992 ఫిబ్రవరి 11న నిర్మాణం పూర్తయింది. దాదాపు కోటి రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ చర్చిలో ఇటలీ నుంచి తెప్పించిన మరియమాత విగ్రహాన్ని, 400 కిలోల చర్చి గంటను ఏర్పాటు చేశారు. ఒకేసారి 200 మందికి పైగా ప్రార్థనలు చేసుకోగల విశాలమైన హాలు చర్చికి ప్రధాన ఆకర్షణగా ఉంది. పైన అమర్చిన తామరపువ్వు ఆకారం జాతీయ భావాన్ని చాటుతోంది. హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ వాస్తు రీతుల అనుగుణంగా స్తంభాలపై శిల్పకళ కనిపిస్తోంది.

సీఎస్ఐ సెంట్రల్ చర్చి

మన దేశాన్ని ఆంగ్లేయులు పాలిస్తున్న రోజుల్లో లండన్ మిషన్ పేరిట ఆధ్యాత్మిక సంస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. 1822 ప్రాంతంలో రెవరెండ్ విలియమ్ హ్యావెల్ ద్వారా ఈ ప్రాంతంలో క్రైస్తవం విస్తరించింది. లండన్ మిషన్ సంస్థను 1947 సెప్టెంబరు 27న చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ)గా మార్చారు. ఈ ప్రాంతంలో మొదటి బిషప్ డోర్నకల్ అజరయ్య కూడా ఇందుకు సహకరించారు. అప్పటినుంచి 2000 సంవత్సరం వరకు పాఠశాల ఆవరణంలోని చర్చిలోనే ప్రార్థనలు నిర్వహించేవారు. ప్రార్థనలకు వచ్చే వారి సంఖ్య పెరగడంతో బిషప్ రెవరెండ్ ఫాదర్ కేబీ ఏసు వరప్రసాద్ ఆధ్వర్యంలో 2000 సంవత్సరం మే 21న ప్రస్తుతమున్న చర్చిని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఒకేసారి రెండు వేల మంది ప్రార్థనలు నిర్వహించుకునే అవకాశం ఉంది.

ఆరోగ్యమాత చర్చి

ఈ చర్చిని కూడా బ్రిటీషు వారి పాలనలోనే నిర్మించారు. అప్పట్లో బళ్లారి నుంచి క్రైస్తవ మత ప్రచారకుడు మన జిల్లాకు వచ్చి సువార్తను ప్రజలకు అందజేసేవారు. ఈ క్రమంలో కొందరు మత గురువులు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ప్రస్తుతం ఆరోగ్యమాత చర్చి ఉన్న ప్రాంతంలో కొట్టాలు నిర్మించుకుని ప్రచారానికి వచ్చినపుడు అందులో విడిది చేస్తూ ఉండేవారు. స్థానిక ప్రజలతో ప్రార్థన చేయించేందుకు విశాలమైన పాకలను, ఆ తర్వాత చిన్నమందిరాన్ని నిర్మించుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రాంగణంలో పెద్ద చర్చి వెలిసింది. దీనికి అనుబంధంగా మరియాపురం ప్రాంతంలో కూడా చర్చిని నిర్మించారు. ఆరోగ్యమాత చర్చికి వచ్చే విశ్వాసుల సంఖ్య బాగా పెరగడంతో ఇటీవల ఆ ప్రాంగణంలో మరో పెద్ద చర్చిని నిర్మించారు. అర్ధ చంద్రాకారంలో రెండు అంతస్తులుగా రూపుదిద్దుకున్న ఈ చర్చిలో ఒక్కొక్క అంతస్తులో 1200 మందికి చొప్పున ఒకేసారి ప్రార్థనలు చేసుకునే వీలుంది. దక్షిణ భారతదేశంలో చర్చిల నిర్మాణంలో సిద్ధహస్తులైన కడపకు చెందిన ప్రముఖ ఇంజనీరు వెంకటేశ్వర్లు ఈ చర్చిని విశిష్ఠంగా డిజైన్ చేశారు. చర్చి ఎదుట విశాలమైన ప్రాంగణంలో వేలాది మంది భక్తులు సామూహిక ప్రార్థనలు చేసుకునే వీలుంది.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

సాక్షి ప్రతినిధి, కడప : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం కడప నగరంలో ఆధునీకకరించిన పలు కూడళ్లను ప్రారంభించడంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వ పరిష్కారం లభించనుంది. అంబేద్కర్ సర్కిల్ నుంచి వై-జంక్షన్ వరకు నిర్మించిన రహదారి నిర్వహణలోకి తీసుకురావడంతో కడప నగరంలో గత కొన్నేళ్లుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికింది. ఆర్టీసీ బస్టాండు నుంచి వై జంక్షన్ ద్వారా తిరుపతి బైపాస్ రోడ్డును, ఇటు అప్సర సర్కిల్ ను కలిపే.. ఈ ప్రధాన రోడ్డును విస్తరించడంలో భాగంగా పలు నిర్మాణాలను తొలగించి పరిహారం అందజేయడంలో, వాహనాల రాకపోకలకు అనువుగా, అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే కోటిరెడ్డి సర్కిల్, నగరానికి నడిబొడ్డున ఉన్న 7 రోడ్ల కూడలిని ఆధునికీకరించి, ప్రజలకు సౌకర్యవంతంగా, నగరానికి వన్నె తెచ్చే విధంగా, నగరానికి వచ్చే బయటి వ్యక్తులను ఆకట్టుకునేలా అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో కడపకు కొత్తకళ వచ్చింది. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో భాగంగా నగరాన్ని అత్యంత ప్రాధాన్యతతో సుందరీకరించడంలో కలెక్టర్ విజయ్‌రామరాజు, కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించారు.



కడప నగరంలో రూపుదిద్దుకున్న అంబేద్కర్ సర్కిల్

సీఎం పర్యటన దృశ్యాలు



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



రిమ్స్‌లోని మెంటల్ ఆస్పత్రిలో సీఎంతో ఉద్యోగుల కరచాలనం



ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

ఒంటిమిట్ట : ఏకశిలానగరి ఒంటిమిట్టలోని కోదండపాణి కోవెల వైకుంఠ శోభను సంతరించుకున్నది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దశరథరాముడు ఉత్తర ద్వారం వద్ద గరుడ వాహనంపై భక్తులకు అభయమిచ్చాడు. ఈ సందర్భంగా రాముల వారి దర్శనం కోసం భక్త జనాలు పోటెత్తారు. శనివారం వేకువ జామున 4 గంటలకు కోవెల ఉత్తర గోపురం ద్వారాలకు శాస్త్రోతంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూల వరులకు ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు, అర్చకులు శ్రావణ్ కుమార్, మనోజ్ కుమార్, పవన్ కుమార్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విష్ణు సహస్రనామార్చనలు, ఆదిత్య హృదయం, తిరుప్పావైపఠనంతో పూజలు నిర్వహించి 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గరుడ వాహనంపై ఆశీనులైన కోదండ రాముడు గోవింద నామస్మరణల మధ్య మాడా వీధుల్లో వైభవంగా ఊరేగి, భక్తులను కటాక్షించారు. టీటీడీ వారు తెచ్చిన బంగారు శటారుతో ఉత్తర ద్వారం ద్వార కోవెలకు వచ్చిన భక్తులకు అర్చకులు ఆశీర్వాదాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటి ఈఓ నటేష్ బాబు, ఆలయ ఇన్స్పెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి పర్యావేక్షించారు.

భక్తులకు ఘనంగా అన్నదానం

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని నూతనంగా ప్రారంభించిన టీటీడీ వారి అన్నప్రసాద వితరణ కేంద్రంలో శనివారం ఉదయం నుంచే ఘనంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు నిర్వహణలో దాదాపు 15 వేల మందికి ప్రత్యేకమైన అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఎంకేఆర్ కన్‌స్ట్రక్షన్ ఆర్థికసాయంతో పుష్పాలంకరణ సుందరంగా చేశారు. దగ్గరుండి పుష్పాలంకరణ చేయించిన ఎంపీటీసీ నారాయణ రెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడుని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అభినందించారు.

రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే మేడా

రెండవ అయోధ్యగా పేరుగాంచి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దర్శనం చేసుకున్నారు.

నందలూరు(రాజంపేట) : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వారా దర్శనం ద్వారా సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు.



ఒంటిమిట్ట : ఉత్తర ద్వారం వద్ద భక్తులకు అభయమిస్తున్న కోదండ రాముడు